సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 22 । మార్చి । 2024



'లైన్' క్లియర్

మూలపేట పోర్టు పనులు ఒక్కో దశను దాటుకుంటూ ముందుకెళ్తున్నాయి. రైల్వే లైన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. - IIలో



డోలోత్సవ వైభవం

శ్రీకూర్మంలో నేటి నుంచి డోలోత్సవం జరగనుంది. నేటి రాత్రి కామదహనోత్సవం నిర్వహిస్తారు. - IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర	శని
సాయంత్రం	ఉదయం
6.10	4.42

న్యూస్‌రీల్

'ఎన్నికల కోడ్‌పై అవగాహన ఉండాలి'

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల ప్రవర్తన నియమావళిపై హోంగార్డు స్థాయి ఉద్యోగి నుంచి అధికారి వరకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, ఫిర్యాదుదారులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని విశాఖ రేంజి డీఐజీ విశాల్ గున్నీ జిల్లా పోలీసులకు సూచించారు. రేంజి డీఐజీగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ రాధిక అధ్యక్షతన ఎన్నికల నేపథ్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. పోలీసులు చేపట్టిన విధి విధానాలు, రూట్ మ్యాప్, గ్రామస్థాయిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. మహిళల ఫిర్యాదులకు అధిక ప్రాధా న్యత ఇవ్వాలని, సమష్టిగా, ఇతర విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. మరో పది హేను రోజుల్లో రివ్యూ నిర్వహించేటప్పటికి ఎన్నికలకు పూర్తి సన్నద్ధమయ్యేలా ఉండాలన్నారు.

ఎక్సైజ్ అధికారులకు దిశా నిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. మద్యం అక్రమ రవాణా, అధిక విక్రయాలు అరికట్టేందుకు ఎక్సైజ్, సెబ్ కలసి తీసుకోవాల్సిన చర్యలపైన గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్లలో ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లకు మద్యం సరఫరా చేసే వాహనాల జీపీఎస్, రూట్ మ్యాప్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. షాపులు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. షాపుల్లో రోజు వారీ రిజిస్టర్లు మెయింటైన్ చేస్తున్నదీ లేనిదీ ఆయన అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మద్యంపైన దృష్టి సారించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా పెట్టాలని ఆదేశించారు. ఒక వ్యక్తికి మూడు బాటిళ్లు మాత్రమే అనుమతిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఏయే షాపులు సమస్యాత్మకంగా ఉన్నాయో గుర్తించాలన్నారు. జిల్లాకు పక్కనే ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో 14 షాపులను గుర్తించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ సుబ్బారావు కలెక్టర్‌కు వివరించారు. రణస్థలం మండలం బంటుపల్లి వద్ద ఉన్న యునైటెడ్ బ్రేవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తయారవుతున్న బీరుపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగు మోతాదులోనే తయారు చేయాలని ఆదేశించారు. కంపెనీ నిర్వహణపై బ్రేవరేజస్ యాజమాన్యంపై డిస్టిలరీ ఆఫీసర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్‌లో వెబ్ కాస్టింగ్ ద్వారా బీర్ల ఫ్యాక్టరీ, ఏపీఎస్‌బీసీఎల్ హోల్ సేల్స్ ప్రతి రోజు పరిశీలించాలన్నారు. ఒడిశా మద్యం రాకుండా చూడడంపై అదనపు ఎస్పీ గంగాధరంను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ బి. సుబ్బారావు, సెబ్ జేడీ గంగాధరం, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు, యునైటెడ్ బ్రేవరి లిమిటెడ్ డిస్టిలరీ ఆఫీసర్ ఎంఆర్‌కే దాస్, బ్రేవరీ యాజమాన్యం పాల్గొన్నారు.

పేదలకు ఉచిత డిఫెన్స్ సిస్టం వరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ఎలాంటి ఆర్థిక స్తోమత లేక జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు ఉచిత లీగల్ సహాయం అందించేందుకు శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానంలో ఉచిత లీగల్ సెల్ ఏర్పాటు చేశామని, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సన్యాసి నాయుడు తెలిపారు. ఆయన గురువారం న్యాయ సదన్‌లో మీడియాతో మాట్లాడుతూ జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ సూచనల మేరకు రాష్ట్రంలో అన్ని జిల్లాల పరిధిలో ఈ కేంద్రాలు గత ఏడాది అక్టోబర్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న నిరుపేదలకు బడుగు బలహీనవర్గాలకు ఈ ఉచిత డిఫెన్స్ సిస్టమ్ ఒక వరంలా పనిచేస్తుందని అన్నారు. కారాగారాల్లో మగ్గుతున్న ఖైదీలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు జి. ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

చిందరవందరగా ఉన్న రాతికట్టడాలు



జీవధారకు ప్రాణదానం

- గొట్టా బ్యారేజ్ వద్ద రాతికట్టడం పటిష్టం
- ఆప్రాన్ నిర్మాణానికి రూ.12.91 కోట్లు మంజూరు
- మాట నిలబెట్టుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- టీడీపీ హయాంలో ప్రతిపాదనలకే పరిమితం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గొట్టా బ్యారేజీ.. జిల్లాకు జీవధార. వేలాది పంటలకు నీరందించే భాగీరథి. ఇక్కడ వరద నీటిని నిల్వ చేసి అవసరమైనప్పుడు కిందకు వదిలే ఏర్పాటు ఉంది. నీరు నిత్యం పారుతుండటంతో బ్యారేజీకి దిగువ భాగాన ఉన్న రాతి కట్టడాలు టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయాయి. ఓ రూ.7 కోట్లు అప్పట్లో ఖర్చు చేసి ఉంటే రాతి కట్టడాల మరమ్మతు పూర్తయిపోయి ఉండేది. కానీ అప్పట్లో నీరు–చెట్టు అని, కాలువల ఆధునికీకరణ అని, నదుల అనుసంధానమని వందలాది కోట్లు కాగితాలపై చూపిన టీడీపీ ప్రభుత్వం ఈ రూ.7 కోట్లు మాత్రం ఇవ్వలేకపోయింది. దీంతో గొట్టా బ్యారేజీ వద్ద రాతికట్టడాల పనులు అలానే మిగిలిపోయాయి. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఏటా కొంచెం, కొంచెంగా ఇసుక మేటలు వేసి రాళ్లు కొట్టుకుపోయి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇక్కడ ఆప్రాన్ నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. రాతికట్టడాన్ని పటిష్టం చేయడానికి రూ.12.91 కోట్లు మంజూరుచేసి గొట్టా ఉనికిని కాపాడింది.

నాడు వైఎస్సార్..నేడు జగనన్న

వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు వంశధార ప్రాజెక్టు గురించి ధర్మాన ప్రసాదరావు ఆయనకు వివరించారు. అప్పట్లో వంశధార స్టేజ్–1, ఫేజ్–2 పనులను జలయజ్ఞంలో భాగంగా రూ.933 కోట్లతో పనులు ప్రారంభించారు. వంశధార గట్లు పటిష్టం చేయడం, హిరమండలం రిజర్వాయర్ నిర్మాణం, ప్యాకేజీ–87, 88లకు శ్రీకారం చుట్టారు. వంశధార నదిలో నీటిని ఒడిసిపట్టి జిల్లాలో 2.55లక్షల హెక్టార్లలో రెండు పంటలకు నీరందించాలంటే అది ఒక్క వంశధార నదిలో నీరు వృథా కాకుండా అడ్డుకట్ట వేయడంతోనే సాధ్యమవుతుందని మంత్రి ధర్మాన ఇంజినీర్లతో చెప్పి డిజైన్ చేయించారు. నదిలో వచ్చే నీటిని నిల్వచేసేందుకు గొట్టాబ్యారేజీ వద్ద గేట్లు ఏర్పాటుచేసి కొంతమేర రైతుల అవసరాలను బట్టి నీటిని వదిలేవారు. నీరు నిత్యం పారుతుండటంతో బ్యారేజీకి దిగువ భాగాన ఉన్న రాతి కట్టడాలు టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన వరదలకు నీటిలో కొట్టుకుపోయాయి. వీటిని బాగు చేయాల్సిన టీడీపీ నాయకులు అవినీతి పనుల్లో మునిగిపోయారు తప్ప పట్టించుకోలేదు. దీంతో ఇవి బాగా పాడైపోయాయి. వాస్తవానికి వంశధార ఎడమ కాలువ పనులుపూర్తిగా చేసేందుకు అప్పట్లో రూ.380కోట్లు ఇస్తే సరిపోయేది. ఇప్పుడు దాని పని అంచనా విలువ రూ.900కోట్లకు పెరిగిపోయింది. అంతేకాకుండా టీడీపీ నేతలు ఎన్నికల ఖర్చుల కోసం ఉద్దానం ప్రాంతంలో 60 వేలు ఎకరాలు భూమిని సాగు చేసేందుకంటూ రూ.6500 కోట్లతో వంశధార– బహుదా ఇంటర్‌లింకింగ్ పేరుతో డిజైన్లు చేశారు. పనులేవీ జరగలేదు. కానీ టీడీపీ నేతలు భారీగా లాభపడ్డట్టు ఆరోపణలు ఉన్నాయి.





అనుమతులు వచ్చాక..

హిరమండలం గొట్టాబ్యారేజీ పరిరక్షణకు ఆప్రాన్ పనులు ఎంతో అవసరం. ఎన్నికల కమిషన్ అనుమతితో పనులు టెండర్లు పిలిచి రానున్న వర్షాకాలం ముందే పనులు పూర్తిచేయాలి. లేకుంటే గొట్టాబ్యారేజీకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. నదీతీర ప్రాంత రైతులను కాపాడుకుంటాం. ఈ పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నం చేస్తాం. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం.

– డోల తిరుమలరావు, బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టు, ఎస్‌ఈ

రూ.12.91కోట్లు మంజూరు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే హిరమండలం రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.176.35కోట్లు, ఉద్దానం ప్రాంతానికి తాగునీరు సౌకర్యం కల్పించేందుకు రూ.700 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూ.852.45కోట్లు, వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించేందుకు రూ.216.71కోట్లు, పాతపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలకు మంచినీటి ప్రాజెక్టు కింద రూ.250కోట్లు మంజూరు చేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద ఆప్రాన్ పనులకు రూ.12.91కోట్లు నిధులు మంజూరు చేశారు. దీనిపై రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

ఐపీఎల్ సంబరాల్లో మన నాట్యం



ఐపీఎల్ ప్రారంభోత్సవంలో నరసన్నపేటకు చెందిన కూచిపూడి నృత్య విద్యాలయం విద్యార్థినులు ప్రదర్శన చేయనున్నారు. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శుక్రవారం ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో నరసన్నపేట కూచిపూడి నృత్య విద్యాలయానికి చెందిన నృత్యకారిణులు పాల్గొననున్నారు. ఈ మేరకు నృత్య విద్యాలయం ప్రతినిధి కీర్తి ప్రియ తెలిపారు. 10 మందితో కూడిన బృందం పాల్గొంటుందని తెలిపారు. ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని, ఈ విధంగా నరసన్నపేట ఖ్యాతి పెరిగినందుకు సంతోషంగా ఉందని కీర్తిప్రియ అన్నారు. ఏఆర్ రహమాన్ స్వరపరిచిన వందేమాతరం పాటకు ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. –నరసన్నపేట

మళ్లీ తేనెటీగల దాడి



మందస రైల్వేస్టేషన్‌లో తేనెటీగల నుంచి రక్షించుకోవడానికి ప్రయాణికుల పాట్లు



రక్షణగా పరదాను చుట్టుకున్న బాధితుడు

మందస: మందస రైల్వే స్టేషన్‌లో తేనెటీగల తుట్ట మళ్లీ కదిలింది. మూడు రోజుల కిందట సుమారు 75 మందిపై దాడి చేసిన తేనెటీగలు.. గురువారం సుమారు 30 మందిపై మరోసారి దాడి చేశాయి. వీటికి భయపడి ప్రయాణికులు పరుగులు తీశారు. ఓ వ్యక్తిపై గుంపుగా దాడి చేయడంతో అక్కడ ఉన్న ప్లాస్టిక్ పరదా కప్పుకుని, తీయడానికి భయపడిన ఆ వ్యక్తి గంట సేపు అలాగే ఉండిపోయాడు. తేనె టీగలు కుట్టిన ప్రాంతంలో బాధతో పాటు పెద్దగా వాచిపోతుండడంతో బాధితులు హాహాకారాలు చేస్తున్నారు. హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స కోసం కొంతమంది వెళ్లగా.. మరికొందరు స్థానిక ఆర్‌ఎంపీల వద్ద చికిత్స తీసుకున్నారు. ఇంకొంతమంది బాధను భరించలేక వాహనాల్లో పలాస ఆస్పత్రులకు వెళ్లారు. రైల్వేశాఖాధికారులు స్పందించి, తేనెటీగల దాడుల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. పలాసకు చెందిన యాదవరావు, హరిపురానికి చెందిన నారాయణల పరిస్థితి విషమించడంతో హరిపురం సీహెచ్‌సీ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

చెట్టును జట్టుగా కాపాడుకుందాం



పర్యావరణాన్ని సమష్టిగా కాపాడుకోవాలని తాడివలస జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం జి.గోపాలరావు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో అడవుల సంరక్షణ–యువత పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని కోరారు. ఈ సందర్భంగా చెట్టు ఆకారంలో విద్యార్థులు ప్రదర్శన చేశారు. – పొందూరు

నిష్పక్షపాతంగా పనిచేస్తాం

- విశాఖ రేంజి డీఐజీ విశాల్ గున్నీ



మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్నీ

శ్రీకాకుళం క్రైమ్ :

రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని విశాఖపట్నం రేంజి డీఐజీ విశాల్ గున్నీ అన్నారు. ఆయన గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల విధులపై అందరికీ పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని చెప్పారు. పోలింగ్ జరిగే రోజు కేంద్రాల రూట్ మ్యాప్‌పై ఎస్‌ఐలకు అవగాహన కల్పించామని, ఇప్పటికే లైసెన్సు తుపాకీలను ఆయా స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో 183 సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, జిల్లాలో 3624 మందిపై బైండోవర్లు కట్టామని, గత కేసులను కూడా పరిశీలించి నివేదికలు తయారు చేసుకున్నామని వివరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే కేంద్ర పోలీస్ బలగాలు, స్థానిక పోలీసులతో కార్డన్‌సెర్చ్‌లు, ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించామని చెప్పారు. డీఎస్పీ, సీఐలు నిత్యం వెళ్లి ఒక్కో గ్రామస్తునితో విడివిడిగా మాట్లాడుతున్నారని తెలిపారు. రేంజి పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై 38 కేసులు నమోదు చేసి వెయ్యి కిలోల వరకు గంజాయిని సీజ్ చేశామన్నారు. జిల్లా పరిధిలో రూ. 84 లక్షలు విలువ చేసే మద్యం, గంజాయి, లిక్కర్ సీజ్ చేశామన్నారు. సోషల్ మీడియాలో ఎలాంటి వివాదాస్పద పోస్టులు పెట్టినా కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. గంజాయి, ఎన్డీపీఎస్, ఐడీ లిక్కర్, వ్యక్తులను గాయపర్చిన అంశాల్లో జిల్లాలో ఐదుగురికి నాన్‌బెయిల్‌బుల్ జారీ చేశామని, ముగ్గురిపై పీడీ యాక్టు కట్టామని వారిలో ఇద్దరు జిల్లా బహిష్కరణలో ఉన్నారని, మరొకరు కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నారని వివరించారు.

- విశాఖ రేంజి పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు (ఎఫ్‌ఎస్‌టీ) 103, స్టాటిక్ సర్వైలెన్సు టీములు 100, సెక్యూరిటీ వింగ్ క్విక్ రియాక్షన్ టీమ్‌లు (క్యూఆర్‌టీ) 25 ఉన్నాయన్నారు. జిల్లాలో 24 ఎఫ్‌ఎస్‌టీ, 24 ఎస్‌ఎస్‌టీలు ఉన్నాయని తెలిపారు.
- నాలుగు జిల్లా సరిహద్దు చెక్ పోస్టులు, రాష్ట్రానికి సంబంధించిన ఏడు అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులున్నాయని, రేంజి పరిధిలో 40 చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీ నిర్వహించి గంజాయి, మద్యం అక్రమరవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే గుర్తించిన కొత్త చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా పెట్టామన్నారు.
- పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగే అవకాశాలు లేవని, మొత్తం వెబ్ క్యామ్‌తో ఎలక్షన్ కమిషన్‌కు పోలింగ్ కేంద్రానికి అనుసంధానమై ఉంటుందన్నారు.

రేంజి పరిధిలో 80 శాతం ఏజెన్సీ ప్రాంతాల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్‌కు ఎలాంటి అలజడులు జరగకుండా కేంద్ర బలగాలు 17 వరకు ఉన్నాయని, వారితో పాటు గ్రేహౌండ్, జిల్లా ప్రత్యేక పోలీసు బృందాలు విధులు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా భరోసా ఇవ్వడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని డీఐజీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో డీఐజీతో పాటు ఎస్పీ రాధిక, అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, సెబ్ జేడీ గంగాధరం పాల్గొన్నారు.

2024 సమరం సన్నద్ధం

సరిహద్దులో కలెక్టర్ పరిశీలన



మెళియాపుట్టి (జెడ్పీ హైస్కూల్) పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మెళియాపుట్టి: ఏజెన్సీ, ఏఓబీ ప్రాంతాల్లో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ గురువారం పర్యటించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తహసీల్దార్ జానకమ్మను సూచించారు. అనంతరం మెళియాపుట్టి, జలకలింగుపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లోని వసుంధర చెక్‌పోస్టును సందర్శించారు. ఎన్నికల వేళ ఎలాంటి మత్తు పదార్థాలు, మద్యం, నగదు, విలువైన వస్తువులు తరలించినా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు సహాయకలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎంపీడీఓ భాస్కరరావు ఉన్నారు.

కొత్త చెక్‌పోస్టు..



కొత్తూరు మండలం కల్లెమ్మ గ్రామం వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్టు ఏర్పాటు చేసిన పోలీసులు

కొత్తూరు: ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలో సరిహద్దు గ్రామమైన మండలంలోని కల్లెమ్మ వద్ద కొత్త చెక్‌పోస్టును గురువారం పోలీసులు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహన



ఓటింగ్ ప్రక్రియపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులకు జిల్లా స్థాయి ముఖ్య శిక్షణ బృందం అధికారులు ఎం.కిరణ్ కుమార్, బాలాజీ నాయక్, శేషగిరిలు కలిసి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్ మిషన్ వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన శిక్షణ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభించడానికి ముందు, పోలింగ్ పూర్తయిన తర్వాత.. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు తప్పనిసరిగా ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ కనెక్షన్లు, బ్యాలెట్ యూనిట్లు సెట్టింగ్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ, మాక్ పోలింగ్ ప్రక్రియను గురించి అందించిన బుక్ లెట్ లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి విధి నిర్వహణలో ఎలాంటి అవరోధాలు లేకుండా పని చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణలో ఓటర్స్ స్లిప్, ఫారమ్‌లు 17–ఏ, 17–బి, 17–సి, 14, 14–ఏ, ఎం–21, మాక్ పోల్ సర్టిఫికెట్, డిక్లరేషన్ ఫారం వంటి అవసరమైన ఫారమ్‌లను పూరించడంపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. శిక్షణ సమయంలో డిస్పాచ్ సెంటర్‌లో కార్యకలాపాలు, పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు, పోలింగ్ ప్రారంభం విధానాలు, క్లోజర్ ప్రొటోకాల్‌లు, పోలింగ్ అనంతరం యంత్రాల సీలింగ్, మెటీరియల్‌ల సీలింగ్, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల నిర్వహణపై కూడా చర్చించారు. శిక్షణలో మొత్తం 130 మంది ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటెత్తాలి..



ఓటు హక్కు ఆవశ్యకతపై ఊరూరా వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. సోంపేటలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం గురువారం నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. – సోంపేట

క్లుప్తంగా

ఐదుగురు పోలీసులకు ఉగాది పురస్కారాలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు లభించాయి. ఉత్తమ సేవా పతాకానికి గాను కళింగపట్నం సీఎస్‌పీఎస్ ఏఎస్ఐ బీజే మోహన్ రావు ఎంపిక కాగా, సేవా పతకాలకు గాను ఎచ్చెర్ల ఏఆర్ హెచ్‌సీ ఎస్.సద్గుణమూర్తి, ఎచ్చెర్ల పీఎస్ ఏఎస్ఐ పీవీ రమణ, కొత్తూరు పీఎస్ పీసీ సీహెచ్ పాపారావు, ఫైర్ డిపార్ట్‌మెంట్ లీడింగ్ ఫైర్‌మెన్ జి.రాజశేఖర్ ఎంపికయ్యారు

'దొంగ ఓట్ల నమోదుపై చర్యలు తీసుకోండి'

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి లచ్చన్న పేట గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణవేణి అనే మహిళ కొంత మంది టీడీపీ కార్యకర్తల ప్రోత్సాహంతో దొంగ ఓటు నమోదు చేసుకున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ యు.విశ్వనాథం, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్ టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఒక పోలింగ్ బూత్‌లో ఇప్పిలి కృష్ణవేణిగా మరో బూత్‌లో బలగ కృష్ణవేణిగా దొంగ ఓట్లు నమోదు చేశారని వెల్లడించారు. కోటూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈఓ బసవల అప్పలస్వామి, బసవల భీష్మ సాయంతో టీడీపీ కార్యకర్తల ప్రోత్సాహంతో దొంగ ఓట్లు నమోదు చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంరక్షణలో ఉన్న చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన దుప్పి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రంలో సంరక్షణ కోసం ఉంచిన చుక్కల దుప్పి గురువారం మృతి చెందింది. ఈ నెల 15వ తేదీన నందిగాం మండలం జయపురం గ్రామ సమీపంలోని తెట్టంగి పంట పొలాల్లో ఇరుక్కుని ఉన్న దుప్పిని గ్రామస్తులు గుర్తించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు ఆ చుక్కల దుప్పిని టెక్కలి సమీపంలోని విదేశీ పక్షుల విడిది కేంద్రంలో ఉంచారు. అప్పటి నుంచి అక్కడే సంరక్షణ పొందుతున్న ఆ దుప్పి గురువారం మృతి చెందింది. అనంతరం పశుశంవర్ధక శాఖాధికారులు దుప్పిని పోస్టుమార్టం చేశారు. అయితే ఆ దుప్పి మృతి చెందడానికి అటవీ శాఖాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఏప్రిల్ 7న జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి

కవిటి: జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థుల భాషాభివృద్ధికి ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయ్ అన్నారు. పెద్దమెళియాపుట్టుగలో ఈ మేరకు గురువారం మేధా సమ్మాన్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న 5వ తరగతి పిల్లలకు ఏప్రిల్ 7న జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, టెక్కలి, మెళియాపుట్టి, పాతపట్నం, భామిని మండలాల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. దీనికి అన్ని ఏర్పాట్లు చేయాలని సభ్యులకు సూచించారు. ఒడియా విద్యార్థులకు ఒడియా మాధ్యమంలో పరీక్షలు రాసే అవకాశం లేనందున అసోసియేషన్ ఇలాంటి పరీక్షలను ఏటా నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కేశవ పురియా, కార్యదర్శి మనోజ్ కుమార్ మహరణ, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు ఉమా మహాపాత్రో, ప్రమోద్ కుమార్ పాఢి, ప్రదీప్ కుమార్ గౌడ, సదానంద గౌడ, క్షమానంద చౌధురీ, ఉషా కిరణ్ గౌడ, లక్ష్మీకాంత్ బెహరా, తులస ప్రధాన్, తారిణి ప్రధాన్, ప్రసాద్ గౌడ, గిరి ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

మూలపేట పోర్టు ప్రాంతం



లైన్ క్లియర్

- మూలపేట పోర్టు రైల్వే లైన్‌కు 72.41 ఎకరాల భూసేకరణ
- ఈ నెల 2న జేసీ సమక్షంలో జరిగిన సమావేశంలో భూములిచ్చేందుకు అంగీకరించిన రైతులు
- ఎకరాకు గరిష్టంగా రూ.26 లక్షల పరిహారం

టెక్కలి:

దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతంగా ముద్ర పడిన శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో తలపెట్టిన మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు రైల్వే లైన్‌కు మార్గం సుగమమైంది. ఈ నెల 2న జిల్లా కేంద్రంలో జేసీ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. సంతబొమ్మాళి మండలం కాశీపురం, కోటపాడు, యామలపేట, పోతునాయుడుపేట, కూర్మనాథ పురం, రాజపురం రెవెన్యూ గ్రామాలకు ఆనుకుని మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు వరకు సుమారు 72.41 ఎకరాల్లో వేయనున్న రైల్వే లైన్ కోసం ఇప్పటికే భూసేకరణ నిర్వహించడంతో పాటు ఆయా రైతులతో అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. చివరగా ఈ నెల 2న శ్రీకాకుళం నిర్వహించిన సమావేశంలో రైతులకు గరిష్టంగా ఎకరాకు రూ.26 లక్షలు చెల్లించేందుకు అధికారులు ఆమోదం తెలియజేయడంతో రైతులు సైతం అంగీకారం తెలిపారు. దీంతో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు రైల్వే లైన్ భూములకు లైన్ క్లియర్ అయినట్లయ్యింది. మరో వైపు ఇప్పటికే టెక్కలి సమీపంలో జాతీయ రహదారి నుంచి మూలపేట పోర్టు వరకు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పుడు రైల్వే లైన్‌కు సైతం రైతులు అంగీకారం తెలియజేయడంతో మరికొద్ది రోజుల్లో ఈ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. పోర్టు ప్రధాన పనులు సైతం వేగవంతంగా జరుగుతున్న సంగతి తెలిసిందే.

మార్కెట్ ధరలకు మించి పరిహారం..

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు రైల్వే లైన్ కోసం కాశీపురం పరిధిలో 8.07 ఎకరాలు, కోటపాడులో 8.375 ఎకరాలు, యామలపేటలో 6.38 ఎకరాలు, పోతునాయుడుపేటలలో 35.55 ఎకరాలు, కూర్మనాథపురంలో 6.94 ఎకరాలు, రాజపురంలో 7.095 ఎకరాలతో కలిపి మొత్తం 72.41 ఎకరాలు సేకరించారు. ఆయా ప్రాంతాల్లో మార్కెట్ ధర కంటే అదనంగా పరిహారం అందజేశారు. భూమిలిచ్చిన రైతులందరికీ సమాన న్యాయం జరిగేలా ఒక్కో ఎకరానికి రూ.26 లక్షలు చెల్లించడానికి అధికారులు ఆమోదం తెలిపారు. దీనికి రైతులు అంగీకారం వ్యక్తం చేశారు.

మా ప్రాంతం అభివృద్ధి..

> మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంతో రాష్ట్రంలో మా మండలానికి ఇప్పటికే గుర్తింపు వచ్చింది. ఈ ప్రాంతం అభివృద్ధికి ఇప్పటికే ఎంతో మంది గ్రామాలు, భూములను త్యాగం చేశారు. ఇప్పుడు రైల్వే లైన్ కోసం మా ప్రాంతంలో రైతులంతా భూములివ్వడానికి అంగీకారం తెలిపారు. పోర్టుతో మా ప్రాంతం అభివృద్ధి చెంది ఉపాధి కలుగుతుందని నమ్ముతున్నాం. ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
> – కోత సతీష్, కోటపాడు, సంతబొమ్మాళి మండలం

శివానీలో ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు



శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మైదానం శుభ్రం చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లాలోని ఎనిమిది నియోజక వర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ సెంటర్లు, ఈవీఎంల స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజక వర్గానికి సంబంధించి డిస్ట్రిబ్యూషన్ శిబిరం సైతం ఇక్కడే నిర్వహించనున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చాల్సి ఉంటుంది. దీంతో బస్సుల్లో ఈవీఎంలు వచ్చే సమయం పార్కింగ్ సమస్య ప్రధానంగా ఉంటుంది. గత ఎన్నికల సమయంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 10 అసెంబ్లీ నియోజక వర్గాలకు సైతం ఇక్కడే స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల వల్ల ఈవీఎంలు తరలింపు జాప్యమైంది. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం నియోజక వర్గానికి ఒక పార్కింగ్ స్థలం కేటాయిస్తున్నారు. ఇక్కడి నుంచి ఈవీఎంల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేసి, స్వీకరించిన ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు తరలించనున్నారు. దీంతో ఎనిమిది పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. బస్సుల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్‌స్థలాలు సిద్ధం చేస్తున్నారు. ప్లొక్లెయినర్, ట్రాక్టర్లు కూడా వినియోగిస్తున్నారు. దీని కోసమే జాతీయ రహదారి నుంచి లింగ్ రోడ్లు వెడల్పు చేస్తున్నారు. కళాశాలలకు వచ్చేందుకు అనువుగా ఉన్న రోడ్లన్నీ సిద్ధం చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు ఇక్కడి నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారు. ఈ మేరకు 309 పోలింగ్ కేంద్రాల ఈవీఎంల తరలింపునకు ప్రత్యేకంగా కౌంటర్ల ఏర్పాటుకు స్థలం సిద్ధం చేస్తున్నారు. కళాశాల మైదానం మొత్తం శుభ్రం చేస్తున్నారు. ఎచ్చెర్ల తహసీల్దార్ వి.శ్యాంకుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఎన్నికలు అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పలు మార్లు సందర్శించి పలు సూచనలు చేశారు.

భద్రతా ప్రమాణాలపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన ఉండాలని శ్రీకాకుళం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు అన్నారు. అరిణాం అక్కివలసలోని నాగార్జునా ఆగ్రికెం పరిశ్రమలో గురువారం పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు– పాటించాల్సిన జాగ్రత్తలపై 53వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న తప్పు ప్రాణాల మీదకు వస్తుందని, కార్మికులు సేఫ్టీ పరికరాలు ధరించి పనిచేయాలని సూచించారు. పరిశ్రమలు సైతం స్వీయ ప్రమాద నియంత్రణ వ్యవస్థ కలిగి ఉండాలన్నారు. ప్రాణ నష్టం అన్నది నియంత్రించాలంటే భద్రతా ఏర్పాట్లు, కార్మికుల్లో అవగాహన కీలకమన్నారు. పరిశ్రమ ఉపాధ్యక్షులు కె.శేషగిరిరావు మాట్లాడుతూ భద్రత, ఉద్యోగులు, కార్మికులు సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అధునాతన సాంకేతిక ప్రగతి వినియోగిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేట్ హెచ్‌పీడీ హెడ్ మణి ప్రసాద్, డీజీఎంలు వర్మ, వి.గోవిందరావు, పర్యావరణ విభాగాధిపతి చిన్నదొరై, సేఫ్టీ మేనేజర్ మాహేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పలసూరికి విప్లవ నివాళి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు, కార్యకర్తలు

నరసన్నపేట: బీజేపీ విధానాలకు, ఆర్‌ఎస్‌ఎస్ సాయంతో చేస్తున్న మతోన్మాద కార్యాకలాపాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపు నిచ్చారు. మోదీకి వంత పాడుతున్న రాజకీయ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు అవసరమని అన్నారు. మండలం కోమర్తిలో మామిడి అప్పలసూరి 27వ వర్ధంతి సభ కోమర్తిలో గురువారం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ తన ఫాసిజాన్ని ప్రజలపై రుద్దుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తంధ్రా ప్రకాశ్, అరుణోదయ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎస్.నీలంరాజు, డి.గణేష్ ఎ.కృష్ణవేణి, గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, బగ్గు భాస్కరరావు, సార జగన్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు అప్పలసూరి స్థూపం వద్ద శ్రీకాకుళ సాయుధ, గిరిజన రైతాంగ పోరాటంలో అశువులు బాసిన అమర వీరులకు నివాళులు అర్పించారు.

వర్షంతో వాణిజ్య పంటలకు మేలు



మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న ఏఓ లతశ్రీ

ఎల్.ఎన్.పేట: రెండు రోజుల పాటు అడపా దడపా కురిసిన అకాల వర్షాలతో వాణిజ్య పంటలకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని వంశధార నదీ తీర గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సాగు చేస్తున్న వాణిజ్య పంటలను గురువారం రైతులతో కలసి ఆమె పరిశీలించారు. వాణిజ్య పంటలైన నువ్వు, హైబ్రీడ్ పెసర పంటలకు వర్షంతో ఊరట లభించిందన్నారు. ఈ వర్షం రైతులు సాగు చేస్తున్న పంటలకు మేలు చేస్తుందన్నారు. ప్రస్తుతం మొక్క జొన్న పంట కోత దశకు చేరుకుందని, కొందరు రైతులు కోత కోసి యంత్రాల ద్వారా నూర్పు చేశారని అయితే వర్షం ఎక్కువగా లేనందున మొక్కజొన్న రైతులకు నష్టం లేదన్నారు. రైతులతో కలసి పంటలను పరిశీలించి అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు చేశామన్నారు.

కొండ దిగువన అస్థిపంజరం

- విశ్వనాథపురంలో కలకలం రేపిన అస్థి పంజరం
- రంగంలోకి దిగిన పోలీసులు
- విజయవాడ ల్యాబ్‌కు నమూనాల తరలింపు



అస్థి పంజరం వద్ద పోలీసులు, వైద్య సిబ్బంది

కోటబొమ్మాళి: విశ్వనాథపురం గ్రామంలో ఓ కొండ. అక్కడే చెత్త సంపద కేంద్రం ఉంటుంది. ఈ ప్రాంతం దాదాపు నిర్మానుష్యంగా ఉంటుంది. కానీ గురువారం నుంచి అందరి దృష్టి ఈ ప్రాంతంపైనే పడింది. కారణం ఓ అస్థి పంజరం. ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండే ఈ ప్రాంతంలో ఓ మనిషి అస్థి పంజరం కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. వీఆర్ఏ బబ్బూరు రాముడు ద్వారా అస్థి పంజరం కనిపించిందన్న వార్త వీఆర్ఓ పైల దాలెప్పకు తెలిసింది. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తన సిబ్బందితో పాటు కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రి వైద్యులు, రెవెన్యూ సిబ్బంది కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. ఎవరినైనా చంపేసి ఇక్కడ పడేశారా..? లేదా ఎవరైనా ఇక్కడకు వచ్చి ఆత్మహత్య చేసుకున్నారా..? లేదా ప్రమాదవశాత్తు ఇక్కడ ఎవరైనా చనిపోయారా..? అన్న చర్చలు స్థానికంగా జరుగుతున్నాయి.

ఈ అస్థి పంజరంలో పుర్రెతో పాటు శరీర భాగాల ఎముకలు చెడిపోకుండా మనిషి ఆకారంలో కనిపిస్తుండటంతో నెల రోజుల కిందట చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. చనిపోయింది ఆడ లేక మగ అనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు. దీంతో పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి మిస్సింగ్ వ్యక్తుల సమాచారాన్ని సేకరించడంలో పడ్డారు. చనిపోయన వ్యక్తి వయసు 40–45 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఈ మృతదేహంలోని నమూనాలను విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని ఎస్ఐ తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి కొంతకాలంగా తిరుగుతూ ఉండేవాడని, ఇటీవల అతను కనిపించడం లేదని విశ్వనాథపురం గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

గేట్ ర్యాంకర్లకు అభినందన

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో సాంకేతిక విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివేందుకు నిర్వహించిన గేట్‌లో శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో చివరి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి ఇంజినీరింగ్ చివరి ఏడాది క్లాస్‌వర్క్ నూజివీడు విద్యా సంస్థలో కొనసాగుతోంది. 42 మంది విద్యార్థులు శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ నుంచి ఉత్తమ ర్యాంకులు సాధించారు. నూజివీడులో ర్యాంకర్లను గురువారం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్, స్థానిక క్యాంపస్ డైరెక్ట ర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీకూర్మంలో డోలోత్సవ వైభవం



శ్రీకూర్మనాథాలయం

- నేటి రాత్రి కామదహనోత్సవం
- 23, 24వ తేదీల్లో పడియా
- 25వ తేదీన డోలోత్సవం



శ్రీకూర్మనాథుడు

గార: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలో శుక్రవారం నుంచి డోలోత్సవం ప్రారంభం కానుంది. తొలి రోజు రాత్రి 10 గంటల నుంచి కామదహనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఏటా ఫల్గుణ మాస త్రయోదశి నాడు మఘ నక్షత్రంలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తారు. తొలుత స్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి మేళతాళాలలతో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం గ్రామ సమీపంలోని కామదహనం మంటపం వద్ద కామదహన కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహిస్తారు. వరుసగా శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు సముద్ర స్నానాలు (పడియా) జరుగుతాయి. అనంతరం శ్వేతపుష్కరిణిలో పవిత్ర స్నానాలాచరిస్తారు. సోమవారం ఉదయం డోలో మంటపంలో స్వామి ఉత్తరాభిముఖదర్శనం ఇస్తారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ డోలోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



బొగియా కృష్ణమూర్తి మృతదేహం

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన బొగియా కృష్ణమూర్తి(44) అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై గురువారం మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. కృష్ణమూర్తి మకరాంపురం జంక్షన్‌లో వెల్డింగ్, పెయింటింగ్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. ఎప్పటిలాగానే గురువారం మధ్యాహ్నం ఓ ఆటోకు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్ కొట్టింది. దీంతో పడిపోయాడు. వెంటనే అతడిని సోంపేట సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 1.15 గంటలకు మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. మృతునికి భార్య ఢిల్లీశ్వరితో పాటు పదేళ్ల, రెండేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఢిల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కంచిలి హెచ్‌సీ కె.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవివాహిత ఆత్మహత్య



జానకిబిసాయి మృతదేహం

కవిటి: మండలంలోని మాణిక్యపురానికి చెందిన జానకిబిసాయి(43) బుధవారం రాత్రి తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నట్లు కవిటి పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జానకి బిసాయి తల్లిదండ్రుల ముగ్గురు సంతానంలో ఈమె చిన్నది. సోదరుడు దేవరాజ్ బిసాయితో ఉంటోంది. చాలా రోజులుగా జానకికి పెళ్లిచేయాలనే ఆలోచనతో పలు సంబంధాలు చూశారు. కానీ ఏవీ కుదరకపోవడంతో ఆమె కొన్నాళ్లుగా తీవ్రంగా వేదన చెందుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో తన ఇంట్లోనే దూలానికి పంచెను కట్టుకుని ఉరి పోసుకుంది.

వెంటనే విషయం తెలుసుకున్న పోలీసులు చీకటి పడిన కారణంగా మృతదేహాన్ని గురువారం ఉదయం సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలి సోదరుడు దేవరాజ్ బిసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసును ఎస్ఐ కె.రాము నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ కూర్మారావు తెలిపారు.

'నువ్వు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి'



హిరమండలం నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి సంధ్య

హిరమండలం: అకాల వర్షాల నేపథ్యంలో నువ్వు పంట విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సంధ్య తెలిపారు. గురువారం మండలంలోని మహలక్ష్మీపురం, గొట్ట, హిరమండలం, అక్కరాపల్లి, అంబావల్లి తదితర గ్రామాల్లో వర్షపు నీటిలో ఉన్న నువ్వు పంటలను పరిశీలించారు. నీటిలో ఉన్న నువ్వుకు యూరియాను స్ప్రే చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎకరాకు అరబస్తా యూరియాను స్ప్రే చేయాలని సూచించారు. అలాగే రైతులకు సలహాలు, సూచనలు అందించారు. సస్యరక్షణ గురించి వివరించారు. నువ్వు పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం తక్కువ వస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

క్షేత్ర సహాయకుడు తొలగింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మందస మండలం భోగాపురం పంచాయతీ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు అగ్గున్న దేవేంద్రను విధుల నుంచి తొలగించినట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ పి.వి.చిట్టిరాజు గురువారం తెలిపారు. దేవేంద్ర రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు రావడంతో పలాస రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ దీనిపై చర్యలకు ఆదేశించారు. ఈ మేరకు దేవేంద్రను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించినట్లు పీడీ తెలిపారు.